సాక్షి నల్లగొండ

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



13 కిలోల గంజాయి పట్టివేత

13 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకుడిని యాదగిరిగుట్ట మండల పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. - IIలో



తడిసిన ధాన్యం

అకాల వర్షానికి జిల్లాలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. - IIలో


గరిష్టం/కనిష్టం 39°/26°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి జగదీశ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు



సూర్యాపేట: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి అల్లాహ్ కరుణ చూపాలని కోరుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యావత్ రాష్ట్ర ముస్లిం మైనా రిటీ ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులుగా సాగుతున్న ముస్లింల ఉపవాస దీక్షల ఆరాధన ఫలించే రోజే రంజాన్ పర్వదినమని పేర్కొన్నారు.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుభాకాంక్షలు

నల్లగొండ : రాష్ట్ర ప్రజలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని, అల్లా ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

నకిరేకల్‌లో షాదీఖానా నిర్మాణానికి నిధులు

- జీఓ కాపీని ఎమ్మెల్యే చిరుమర్తికి అందజేసిన సీఎం కేసీఆర్



ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు జీఓ కాపీ అందజేస్తున్న సీఎం కేసీఆర్

నకిరేకల్ : నకిరేకల్‌లో షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి మంజూరయ్యాయి. ఆ జీఓ కాపీని సీఎం కేసీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం కేసీఆర్‌కు వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు పూర్తికి నిధులు మంజురు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పంట నష్టపరిహారం నిధులు విడుదల

నల్లగొండ అగ్రికల్చర్ : ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగండ్ల వాన కారణంగా వరి, పండ్ల తోటల రైతులకు జరిగిన పంట నష్టపరిహారానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 371 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. దానికి సంబంధించిన రూ.37లక్షల 60వేల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పంట నష్టపోయిన రైతుల, ఎంత విస్తీర్ణం అన్న వివరాలను జిల్లా ట్రెజరీకి వ్యవసాయ శాఖ అందజేసింది. రెండు మూడు రోజుల్లో నేరుగా రైతుల ఖాతాల్లో పరిహారం జమ కానుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా ఎవరూ స్పందించ లేదు.

కంటి వెలుగు గొప్ప పథకం



కంటి అద్దాలు అందజేస్తున్న సుఖేందర్‌రెడ్డి

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు గొప్ప పథకమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శుక్రవారం ఆయన కంటి వెలుగు అద్దాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగులో ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా కంటి అద్దాలు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, పాలగోని స్వామి, కంచర్ల జన్నారెడ్డి, ఉయ్యాల నరేష్, ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

23న ప్రవేశ పరీక్ష

రామగిరి(నల్లగొండ) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో అడ్మిషన్లకు ఏప్రిల్ 23న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్సీ గురుకుల రీజినల్ కోఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

క్వింటాకు 3 కిలోలు కట్!

- నిడమనూరు మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన ఓ రైతు 350 క్వింటాళ్ల ధాన్యం విక్రయించగా తాలు పేరుతో మిల్లర్ క్వింటాల్‌కు 3 కేజీల చొప్పున కోత విధించారు. ఇలా ఆ ఒక్క రైతుకే 10 క్వింటాళ్ల 50 కేజీల ధాన్యం కోత విధించడంతో రూ.21,630 నష్టం వాటిల్లింది.
- త్రిపురారం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన తరువాత బస్తాలను నాలుగైదు రోజులు కల్లంలోనే ఉంచుతున్నారు. దీంతో బరువు తగ్గుతోంది. ఆ మేరకు బస్తాకు 2 కిలోల చొప్పున కోత పెడుతున్నారు. కాంటాలు వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలిస్తే ఈ నష్టం జరిగేది కాదు. లారీలు సమయానికి రాకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.
- నిర్ణీత తేమ శాతం ఉన్నా తాలు ఉందన్న సాకుతో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. కొన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు సరఫరా చేయడం లేదు. దీంతో శుక్రవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్దవూరలోని సబ్ మార్కెట్ యార్డు ముందు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.



పెద్దవూరలో జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు	264
ఐకేపీ	121
పీఏసీఎస్	143
ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం	60,258 మెట్రిక్ టన్నులు
మిల్లులకు తరలించింది	56,850 మెట్రిక్ టన్నులు
కేంద్రాల్లో ఉన్న ధాన్యం	3,408 మెట్రిక్ టన్నులు
ధాన్యం అమ్మిన రైతులు	7,141 మంది
కొనుగోలు చేసిన ధాన్యం విలువ	రూ. 124.13 కోట్లు

- తాలు పేరుతో రైతులను దోచుకుంటున్న మిల్లర్లు
- లారీల కృత్రిమ కొరత సృష్టించి అదనపు వసూళ్లకు పాల్పడుతున్న యజమానులు
- కొన్ని చోట్ల కాంటాలు వేసినా కేంద్రాల్లోనే బస్తాలు
- ఎండకు తూకం తగ్గితే.. ఆ భారం కూడా రైతులపైనే
- కొనుగోళ్లలో కొర్రీలపై ఆగ్రహంతో పెద్దవూరలో రోడ్డెక్కిన అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే విషయంలో రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఓ పక్క తాలు పేరుతో కొనుగోలు కేంద్రంలో అధికంగా తూకం వేస్తూ నష్టం చేస్తుండగా, అదే తాలు పేరుతో మిల్లర్లు క్వింటాల్‌కు మూడు కిలోలు కోత విధిస్తున్నారు. మరో పక్క లారీ యజమానులు లారీల కృత్రిమ కొరత సృష్టించి బస్తాకు రూ.2 చొప్పున రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. అవి చెల్లించిన వారి ధాన్యాన్నే మిల్లులకు తరలిస్తూ చెల్లించని వారి ధాన్యం అక్కడే ఉంచి ఇబ్బందులపాలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు పంపించాల్సి ఉన్నా, తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో ఎండకు ఎండి, ధాన్యం బరువు తగ్గిందంటూ మిల్లుల్లో అదనపు కోత విధిస్తున్నారు. ఇప్పటికే హమాలీ ఖర్చులను భరిస్తున్న రైతులను ఇప్పుడు రకరకాల పేర్లతో దోపిడీ చేస్తున్నారు.

కేంద్రాల్లో అదనపు తూకం

కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 41 కిలోలు కేజీల తూకం వేయాల్సి ఉండగా తేమ ఉందంటూ 42 కిలోలకు పైగా తూకం వేస్తున్నారు. తూకం వేసిన వెంటనే ఆ ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారా? అంటే అదీ లేదు. రెండు, మూడు రోజుల తర్వాత మిల్లులకు తరలించడంతో మిల్లర్లు ధాన్యంలో తాలు శాతం అధికంగా ఉందని, ధాన్యం తూకం తగ్గిందన్న సాకులు చెబుతూ క్వింటాల్‌కు 3 కిలోల చొప్పున కోత విధిస్తూ రైతులకు నష్టం చేస్తున్నారు.

బస్తాకు రూ.2 వసూలు చేస్తున్న లారీల యజమానులు

ఇంకోవైపు లారీ యజమానులు కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే ధాన్యం మిల్లులకు రవాణా చేసే విషయంలో లారీల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బస్తాకు రెండు రూపాయలు ఇస్తేనే రవాణా చేస్తామని పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్ తమకు ఇచ్చే డబ్బులు సరిపోవడం లేదని, తాము నష్టపోతున్నందున బస్తాకు రూ.2 చొప్పున ఇస్తేనే ధాన్యం రవాణా చేస్తామని చెబుతుండటంతో చేసేదేమీ లేక రైతులు డబ్బులు చెల్లించి రవాణా చేయించుకోవాల్సి వస్తోంది.

ధాన్యం వెంటనే రవాణా చేయాలి



ధాన్యం తూకం వేసిన వెంటనే మిల్లులకు ట్రాన్స్‌పోర్టు చేయాలి. రోజుల తరబడి ఉంచడం వల్ల తూకం తగ్గే అవకాశం ఉంది. దీంతో రైతుల ధాన్యంలో కోత విధిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించకుండా లారీలను ఏర్పాటు చేయాలి.

– కారింగు శంకర్‌గౌడ్, రైతు, శాబ్దుల్లాపురం, కనగల్ మండలం

తాలు ఉందంటూ జాప్యం చేస్తున్నారు



ఇరవై రోజుల కిందట 400 బస్తాల ధాన్యాన్ని సబ్ మార్కెట్ యార్డులో పోశా. రెండు రోజుల కిందట అధికారులు వచ్చిన నిర్దేశిత తేమ శాతం ఉందని చెప్పారు. కానీ తూకం వేయడం లేదు. అడిగితే తాలు ఉందంటున్నారు.

– మంచికంటి అనిత, సంగారం, పెద్దవూర మండలం

అదనంగా తూకం వేస్తున్నారు



పదెకరాల్లో పండించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రానికి తెచ్చా. బస్తాకు 41 కిలోలు తూకం వేయాల్సి ఉన్నా 42 కిలోలకు పైగా వేస్తున్నారు. కాంటాలు వేసిన బస్తాలు మిల్లులకు వెంటనే తరలించడం లేదు. రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

– రేపాల సైదిరెడ్డి, రైతు, త్రిపురారం



రంజాన్ పండుగకు సిద్ధమైన నల్లగొండలోని మదీన మసీదు

నేడు ఈద్ ఉల్ ఫితర్

- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు
- నల్లగొండ ఈద్గా వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

రామగిరి(నల్లగొండ) : రంజాన్ పండుగకు అంతా సిద్ధమైంది. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు శుక్రవారం నెలవంక దర్శనమివ్వడంతో శనివారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్ పండుగ) నిర్వహించుకుంటారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నల్లగొండలోని పట్టణంలో మునుగోడు రోడ్డు ఈద్గాతో పాటు, పానగల్లు, చర్లపల్లి మసీదులలో రంజాన్ అన్ని ఏర్పాట్లు చేశారు. మసీదులకు రంగులు వేయించి తాగునీటి వసతి కల్పించారు. మునుగోడు రోడ్డులోని ఈద్గా వద్ద రూ.9 లక్షలలో అంతర్గతంగా రోడ్లు వేయించారు. ప్రత్యేకంగా స్టేజీ, వేసవి దృష్ట్యా టెంట్‌లు, సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ అపూర్వరావు

రంజాన్ పండుగ సందర్భంగా మునుగోడు రోడ్డులోని ఈద్గాను ఎస్పీ అపూర్వరావు శుక్రవారం సందర్శించారు. ఈద్గా వద్ద మెటల్ డిటెక్టర్, డాగ్ స్క్వాడ్, బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని డీఎస్పీ నరసింహారెడ్డి, వన్‌టౌన్ సీఐ రౌతు గోపిని ఆదేశించారు. ఆమె వెంట ఈద్గా ఇన్‌చార్జి డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హఫీజ్‌ఖాన్, పీస్ కమిటీ సెక్రటరీ డాక్టర్ ఏఏ.ఖాన్, సాజిద్ ఉన్నారు.

నేరస్తులకు కోర్టుల ద్వారా శిక్ష పడాలి

- ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : నేర సంఘటనల్లో భాగస్వామ్యం ఉన్న వారికి కోర్టు ద్వారా శిక్ష పడితేనే బాధితులకు పోలీస్ శాఖపై నమ్మకం కలుగుతుందని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పలు కేసుల్లో పురోగతి లేని అధికారులు పనితీరును మెరుగు పర్చుకోవాలని మందలించారు. నేర సంఘటనల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆధారాలు సేకరించాలని సూచించారు. చట్ట వ్యతిరేక వ్యాపారాలు జరగకుండా నిరంతరం పోలీస్ నిఘా పెట్టాలన్నారు. పోలీస్ శాఖ వర్టికల్స్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మిర్యాలగూడ, నల్లగొండ డివిజన్‌లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో తూకంలో రైతులను మోసం చేయకుండా నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఏఎస్పీ ప్రసాద్ రావు, డీఎస్పీలు వెంకటగిరి, నాగేశ్వర్‌రావు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం



కిష్టాపురంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



ప్రధాని మోదీ, రాజగోపాల్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు

మునుగోడు : ఫార్మా కంపెనీ నిర్మాణాన్ని ఆపే విషయంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఇరు పార్టీల నాయకులు శుక్రవారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో పోటాపోటీగా దిష్టిబొమ్మలు దహనం చేశారు. అధికార బీఆర్ఎస్ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నిర్లక్ష్యం వల్లే కంపెనీ నిర్మాణం కొనసాగుతుందని ఆరోపిస్తూ బీజేపీ నాయకుల కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కావాలనే బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆ పార్టీ నాయకులను రెచ్చగొట్టి మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయించాడని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు అదే గ్రామంలో రాజగోపాల్‌రెడ్డి, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. దీంతో కిష్టాపురం గ్రామంలో రాజకీయ వేడి ఒకసారిగా మొదలైంది. ఫార్మా కంపెనీ రద్దు చేసేందుకు అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టకుండా ఇరు పార్టీలు పరస్పరం వాదనలకు దిగితే ఫార్మా వ్యాపారులకు మేలు కలగుతుందే తప్పా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని కిష్టాపురం గ్రామస్తులు అంటున్నారు.

మునుగోడులో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

నియోజకవర్గ కేంద్రమైన మునుగోడును స్థానిక ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని, కనీసం ప్రభుత్వ కళాశాల, 100 పడకల ఆసుపత్రి కూడా మంజూరు చేయించలేదని విమర్శిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. నిధులు మంజూరు చేయించాలని లేనిపక్షంలో ఎమ్మెల్యేను గ్రామాల్లో తిగనివ్వమని హెచ్చరించారు. ఇలా పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం వ్యవహారం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

కొర్రీలు పెట్టే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలి

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేలా కొర్రీలు పెట్టే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి రైస్ మిల్లర్లు, అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి చేసుకోకుండా కొన్ని రైస్ మిల్లుల యజమానులు పేచీలు పెడుతున్నట్లు తనకు తెలిసిందని, అలాంటి వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వర్షాలు వస్తున్నందున కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కాంటాలు వేసి మిల్లులకు పంపాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ కాళిందిని, పౌర సరఫరాల శాఖ డీఎం నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్ల అయితే అబార్షనే!

- పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల దురాఘతం
- నల్లగొండ, మిర్యాలగూడలో యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారం
- గ్రామీణ వైద్యులు, కొందరు గైనకాలజిస్టులే సూత్రధారులు
- ఇటీవల జిల్లా కేంద్రంలో కేసు నమోదు



నల్లగొండ టౌన్ : గర్భంలోనే పిండాలను చంపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. ఆడపిల్ల అని తేలితే కడుపులోనే ఛిదిమేస్తున్న వైనాన్ని 'సాక్షి' ప్రధాన సంచికలో ఈ నెల17న 'ఆపదలో అమ్మ' అనే శీర్షికన ప్రచురించింది. జిల్లాలో అబార్షన్‌లను ప్రోత్సహిస్తున్న వైనాన్ని వెలుగులోకి తెచ్చింది. గ్రామీణ మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు వైద్యులు లింగనిర్ధారణ పరీక్షలు చేసి అబార్షన్లు చేస్తున్నారు. ఇందుకోసం గ్రామాల్లోని ఆర్ఎంపీలను మధ్యవర్తులుగా పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో యువతికి అబార్షన్ చేయించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

476 ప్రైవేట్ ఆస్పత్రులు..

జిల్లా వ్యాప్తంగా 476 ప్రైవేట్ ఆస్పత్రులు, సుమారు వరకు 50 వరకు స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లు వైద్య ఆరోగ్యశాఖ అనుమతితో నడుస్తున్నాయి. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల అనుమతి తీసుకున్న వారిలో 20 శాతం మంది వరకు ఆర్ఎంపీ, మెడికల్ షాపు నిర్వహిస్తున్నవారు ఉన్నారు. పలానా విభాగాలకు చెందిన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ల వివరాలను మాత్రమే వైద్య ఆరోగ్య శాఖకు అందించి అనుమతి పొందారు. వీటిలో చాలా చోట్ల లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి అబార్షన్లు చేస్తున్నారు. అబార్షన్లు చేయడం పెద్ద ప్రాణానికే ప్రమాదమని తెలిసినా ఈ వ్యవహారం ఆగడం లేదు. ఒక్కోసారి అబార్షన్ చేసే క్రమంలో పెద్ద ప్రాణం పోయినా బయటికి పొక్కకుండా ఆస్పత్రుల యజమాన్యం అన్ని శాఖలను మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం.

నిరంతరం నిఘా ఉన్నా..

లింగనిర్ధారణ పరీక్షలను చేసి ఫలితాలను వెల్లడించకుంగా ప్రభుత్వం పీసీపీఎన్‌డీటీ యాక్టును అమల్లోకి తెచ్చింది. లింగనిర్ధారణ పరీక్షలను చేసిన వారితో పాటు చేయించిన వారిని, దానికి ప్రోత్సహించిన వారిని, అబార్షన్లను చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్కానింగ్ సెంటర్ల, ఆస్పత్రుల్లో ప్రతి నెలా స్కానింగ్‌ల వివరాలు సేకరిస్తారు. అయినా అబార్షన్ల వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది.

నల్లగొండ, మిర్యాలగూడలో..

నల్లగొండలోని డాక్టర్స్ కాలనీలో గల రెండు మూడు ఆస్పత్రులు, ప్రకాశంబజార్‌లోని రెండు ప్రధాన ఆస్పత్రులు, రామగిరిలోని ఒక ఆస్పత్రి, దేవరకొండ రోడ్డులోని నాలుగు ఆస్పత్రులు, జీజీహెచ్‌కు సమీపంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో నిరంతరంగా లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తు అబార్షన్లను చేస్తున్నారనే ఆరోపనలు ఉన్నాయి. మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీ, దానికి సమీపంలోని ఒక ప్రముఖ గైనకాలజిస్టుకు చెందిన ఆస్పత్రిలో అబార్షన్ల తంతు నిరంతరాయంగా సాగుతున్న సమాచారం.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేస్తాం



ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లపై నిరంతరం నిఘా ఉంచాం. లింగనిర్ధారణ పరీక్షల వివరాలను తెలిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇకపై ప్రతి వారం స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించి రిపోర్టులు తీసుకుంటాం. అబార్షన్లను ప్రోత్సహించే వారి వివరాలు, చేసిన వారి వివరాలను ప్రజలు అధికారులకు తెలియజేయాలి.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్ఓ

గ్రామీణ వైద్యులను ఏజెంట్లుగా నియమించుకుని..

కొందరు గైనకాలజిస్టులు గ్రామీణ వైద్యులను ఏజెంట్లుగా నియమించుకుని తమ వద్దకు వచ్చే గర్భిణులను స్కానింగ్ సెంటర్‌కు పంపుతారు. అక్కడ స్కానింగ్ పూర్తయ్యాక ఆడ మగ అనే విషయాన్ని నిర్ధారణ చేసుకుంటారు. గ్రామీణ వైద్యుల ద్వారా గర్భిణుల తల్లిదండ్రులు, అత్తలు, ఇతర సమీప బంధువులకు ఆడమగ అనే సమాచారాన్ని చేరవేసి అబార్షన్లకు పోత్సహిస్తున్నారు. ఒక్కో అబార్షన్ చేసినందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలపై డిపార్టుమెంటల్ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశమయ్యారు. ఏప్రిల్ 25 నుంచి మే 4వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు ఇంటర్మీడియట్‌లో 2,091 మంది, పదో తరగతిలో 1,434 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావు ఉండొద్దన్నారు. పదో తరగతికి 6, ఇంటర్మీడియట్‌కు 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఈఓ భిక్షపతి, జిల్లా కోఆర్డినేటర్ జగదీష్, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, చిత్రంలో డీఈఓ భిక్షపతి

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


అంజయ్య (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలో వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన కీత అంజయ్య(46) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కీతవారిగూడెం గ్రామానికి చెందిన కీత అంజయ్య ఈనెల 17న గ్రామ శివారులో వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో అంజయ్యకు తలకు, కుడి కాలుకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువు కీత రామనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి..

మోటకొండూర్: చేపలు పట్టేందుకుగాను తెప్పలో చెరువులోకి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి బాలయ్య(58) గురువారం చెరువులో చేపలు పట్టేందుకు తెప్పలో వెళ్లాడు. ఎండకు ఆయాసం కావటంతో ఒడ్డు చేరుకోగానే కిందపడిపోయాడు. దీంతో ఆయనను ఆలేరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు శుక్రవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు.

తుర్కపల్లిలో చోరీ

తుర్కపల్లి: వృద్ధురాలి మెడలోని బంగారు గుండ్లు గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గిరి రంగమ్మ తన కుమార్తె ఇంటికి వచ్చి కొన్నిరోజులుగా ఇక్కడే ఉంటుంది. శుక్రవారం గ్రామంలో సంత కావడంతో కుమార్తె సత్తెమ్మ కూరగాయలు అమ్మడానికి సంతకు వెళ్లింది. ఈ క్రమంలో సుమారు 7గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి మంచినీరు అడిగాడు. ఆమె నీరు తెచ్చి ఇవ్వగానే రంగమ్మ మెడలో మెడలో ఉన్న తులంన్నర బంగారు గుండ్లను లాక్కొని వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

సెలవులొచ్చాయ్..

2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. సెలవులు 25వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా.. 21 ఐచ్ఛిక సెలవు, 22న రంజాన్, 23న ఆదివారం ఉండటంతో హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు మూడు రోజుల ముందుగానే వసతి గృహాలను ఖాళీ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రిభువనగిరి


తల్లిదండ్రులతో కలిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు




భువనగిరి గురుకుల హాస్టల్ నుంచి స్వస్థలాలకు వెళ్తున్న విద్యార్థులు

ధాన్యం కొనకపోవడంతో రైతుల ఆగ్రహం


పెద్దవూరలో రాస్తారోకో చేస్తున్న రైతులు


రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్న ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి

- పెద్దవూరలోని జడ్చర్ల– కోదాడ హైవేపై రాస్తారోకో

పెద్దవూర: తాలు పేరిట వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు ఎదుట జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. లారీలు తెప్పించటంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పలు గ్రామాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించక ముందే ఇరవై రోజుల క్రితం వరి ధాన్యాన్ని పెద్దవూర సబ్ మార్కెట్‌లో పోశామని తెలిపారు. ఈ నెల 17న ఎమ్మెల్యే నోముల భగత్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 20న అధికారులు వచ్చి ధాన్యంలో తేమ శాతం చూశారని, మ్యాచర్ సరిగ్గా వచ్చినప్పటికీ ధాన్యంలో తాలు ఉందని బస్తాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వద్ద సైతం తాలు చూసే పరికరాలు లేవని, అయినా తాలు ఉందని ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రంలో సుమారు 80కి పైగా ధాన్యం రాశులు ఉంటే అందులో 60కి పైగా తాలు ఉందన్న సాకుతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. ఖాళీ బస్తాతో పాటు బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41.200 కిలోలు తూకం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఉన్నతాధికారులు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చేదాకా రాస్తారోకోను విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి వచ్చి రైతులతో తహసీల్దార్‌తో మాట్లాడించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, రైతులు మోహన్‌రెడ్డి, కంచర్ల రేణుక, వడ్డేపల్లి వెంకట్‌రెడ్డి, మంచికంటి అనిత, కంచర్ల సైదిరెడ్డి, మాధవరెడ్డి, అశోక్, లక్ష్మమ్మ, కల్లూరి మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జానారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, గోవర్ధన్‌రెడ్డి, అలివేలు, జనార్దన్ రెడ్డి, వెంకటయ్య, లాలయ్య, భార్గవరెడ్డి, చిరంజీవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఉన్నతాధికారుల ఆదేశానుసారం శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేపటి నుంచి ధాన్యానికి సరిపడా లారీలు వచ్చేలా చూస్తామని, తాలు పట్టే యంత్రాలను తెప్పిస్తామని, ఏరోజుకు ఆరోజు కొనుగోలు చేసి కాంటాలు వేస్తామని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి సందీప్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

● అకాల వర్షం.. తడిసిన ధాన్యం


శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నల్లగొండ శివారులోని కంచనపల్లి ఐకేపీ సెంటర్‌లో కొట్టుకుపోతున్న ధాన్యం


కంచనపల్లి ఐకేపీ సెంటర్‌లో బురదలో ధాన్యం


చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో..

13 కిలోల గంజాయి పట్టివేత


నిందితుడిని పట్టుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: 13 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకుడిని ఎల్‌బీనగర్ జోన్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారిలో యాదగిరిగుట్ట మండలంలోని బాహుపేట గ్రామ స్టేజీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం తెనుగువాడ గ్రామానికి చెందిన నెన్నాల మహేష్, భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన మెట్టు రంజిత్‌లు ఇద్దరూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని ద్విచక్ర వాహనం మీద తరలిస్తున్నారు. దీంతో పక్కా సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు ఎన్‌హెచ్ 163 ప్రధాన జాతీయ రహదారిలోని యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామం స్టేజీ పరిధిలో వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా, బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరిలో మెట్టు రంజిత్ పారిపోగా.. నెన్నాల మహేష్ పట్టుబడ్డాడు. దీంతో అతడి బైక్‌ను తనిఖీ చేయగా 13 కిలోల గంజాయి లభించింది. అతడి వద్ద సెల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకుడు ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ అని, సేల్స్ చేసేవాడు పారిపోయాడని ఎస్వోటీ పోలీసులు తెలిపారు. నిందితుడిని యాదగిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ రావు తెలిపారు.

మానవ మృగానికి 20 ఏళ్ల జైలు

చివ్వెంల(సూర్యాపేట): మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ ఆస్పత్రి వద్ద ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లలో ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. ఆమె భర్త 10 సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈమె ప్రతిరోజు కూలి పనికి వెళ్తుంది. ఈ క్రమంలో పని ప్రదేశంలో చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన భానోతు శ్రీనుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెతో కలిసి అదే ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆరో తరగతి వరకు చదివి ఇంట్లో ఉంటూ తల్లితో అప్పుడప్పుడు పనికి వెళ్తున్న ఆమె కూతురిపై శ్రీను కన్ను పడింది. ప్రతిరోజు తల్లి పనికి వెళ్లగానే బాలికను లైంగికంగా వేధించేవాడు. 1-12-2019న ఇంట్లో ఎవరు లేని సమయంలో సాయంత్రం బాలికను ఇంట్లోకి బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. తిరిగి మరుసటి రోజు అత్యాచారం చేయబోగా బాలిక కేకలు వేసింది. దీంతో అతను పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన విషయాన్ని చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కె.శివశంకర్ నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ త్యాగరాజన్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాలికకు రూ.7 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేశారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కానిస్టేబుల్ కృష్ణ సహకరించారు.

ఉపాధి కూలీకి గాయాలు

మద్దిరాల: మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనిచేసే క్రమంలో కార్మికుడికి గాయాలయ్యాయి. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన బెజ్జంకి చంద్రారెడ్డి రోజు మాదిరిగానే శుక్రవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అక్కడ పని చేసే క్రమంలో రోడ్డు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా గాయాలు కావడంతో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. చంద్రారెడ్డి కాలు ప్యాక్చర్ అయినట్లు ఏపీఓ వెంకన్న తెలిపారు.

మెడిసిన్ నిల్వచేసినందుకు ఇద్దరికి మూడేళ్ల శిక్ష

భువనగిరి: లైసెన్స్ లేకుండా మెడిసిన్‌కు సంబంధించిన మందులు నిల్వ చేసిన నిందితులకు 3 సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి దశరథ రామయ్య శుక్రవారం తీర్పు వెల్లడించారు. భువనగిరిలో ఏ ఎట్టిబాబు, ఏ జ్యోతి మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. అనుమతి లేకుండా పట్టణంలో మనోహర్ నివాసంలో మందులు నిల్వ చేశారు. ఈక్రమంలో 2013లో అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌సింగ్, శ్రీకాంత్‌కు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మెడిసిన్ నిల్వ చేయడంతో కేసు నమోదు చేసి కోర్టులో దాఖలు చేశారు. శుక్రవారం కోర్టులో విచారణ సందర్భంగా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంతో నిబంధనలకు విరుద్ధంగా మందులు నిల్వ చేసినట్లు రుజువు కావడంతో ఇద్దరికి 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 20వేలు జరిమానా విధిస్తూ తీర్పు ప్రకటించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు ప్రస్తుత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ తెలిపారు.

పిడుగు పడి తాటిచెట్టు దగ్ధం

మునుగోడు: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. మునుగోడు గ్రామ శివారులోని కంత మహేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని ఓ తాటి చెట్టుపై పిడుగు పడింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

భూదాన్‌పోచంపల్లి: పీవీసీ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఆరుగురు ఒడిశా వలస కార్మికులపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు రిమాండ్ చేశారు. నారాయణగిరి గ్రామ సమీపంలో పీవీసీ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఆరుగురు ఒడిశా వలస కార్మికులను బుధవారం ఇటుక బట్టీల యజమాని వెంకటకిరణ్, సురేశ్‌లు దాడి చేసి గాయపరిచారు. ఈమేరకు వారిని అరెస్ట్ చేసి శుక్రవారం భువనగిరి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు.

ముందస్తు ఖరీఫ్ సాగుకు సిద్ధమవ్వండిలా..

- గుర్రంపోడు ఏఓ మాధవరెడ్డి


కంచర్ల మాధవరెడ్డి వ్యవసాయాధికారి, గుర్రంపోడు


వేసవి దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

పాడి పంట

గుర్రంపోడు : వేసవిలో అడపాదడపా కురిసే వర్షాలను వినియోగించుకుని ముందస్తుగా రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటకు అనువైన నల్లరేగడి భూముల్లో వేసవి దుక్కులను రైతులు చేపడుతున్నారు. వేసవి దుక్కులు, భూసార పరీక్షలు, నేల స్వభావాన్ని బట్టి పంటల సాగు ఇతర సాగు విధానాలపై రైతులు మెళకువలు, అవగాహన కల్గి ఉండాలని, వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయాధికారి కె.మాధవరెడ్డి సూచిస్తున్నారు.

లోతు దుక్కులతో మేలు

లోతు దుక్కులు దున్నినప్పుడు భూమిలో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉంటుంది. భూమిలో దాగి ఉన్న లేదా నిద్రావస్థలో ఉన్న పురుగులు, తెగుళ్లను కలుగ జేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకి నశిస్తాయి. దుక్కిలో బయట పడిన గుడ్లు, ప్యూపాలను పక్షులు తిని నాశనం చేస్తాయి. కాబట్టి తొలకరిలో వేసే పైర్లకు నీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. భూమిలో 9 అంగుళాల వరకు లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకోవడం శ్రేయస్కరం.

పంట మార్పిడి తప్పనిసరి

భూమిలో ఏటా పంట మార్పిడి చేసుకోవాలి. రైతులు ఒకే రకమైన పంటను వరుసగా సాగు చేస్తూ దిగుబడులు రాక నష్టపోతున్నారు. ఒకే పంటను ఏళ్ల తరబడి పండించడం వల్ల చీడపీడలకు ఎప్పుడూ ఆహారం సమృద్ధిగా లభించి అవి వృద్ధి చెందుతాయి. ఆ పంట వేర్లు వ్యాపించిన మేర భూమి పొరలు నిస్సారమవుతాయి. పంట మార్పిడి నేలసారాన్ని కాపాడుకోవడంతోపాటు తేమను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. వివిధ రకాల వేరు వ్యవస్థలు కలిగి భిన్నంగా పెరిగే పైర్లను పంట మార్పిడి కోసం ఎంపిక చేసుకోవాలి. పత్తి, ఆముదం, పొద్దు తిరుగుడు వంటి పైర్లు నేల లోపలి నుంచి పోషకాలు తీసుకుంటాయి. పోషకాలు ఎక్కువగా తీసుకునే నువ్వులు , పొద్దు తిరుగుడు వంటి పంటలకు భూమికి పోషకాలు సమకూర్చే అవసరాల పైర్లతో పంట మార్పిడి చేసుకోవాలి. ఇవి బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి. వరుసగా పప్పుదాన్యాల పంటలు కాకుండా నూనె పంటలు సాగు చేయాలి. మిరప, టమాట, వేరుశనగ, పంటలను ఆశించే లద్దె పురుగు నివారణకు జొన్న, సజ్జ, రాగి పంటల ఎర పంటలుగా వేసుకోవాలి. టమాట, మిరప, పుచ్చ పంటల్లో బంతిని కూడా వేరే పంటగా కొన్నిసాళ్లు వేసుకుని తెగుళ్ల, ఆకుముడత నివారించవచ్చు.మార్పిడి చేసేటప్పుడు అనుకూలమైన పంటలు ఎంచుకోకపోతే చీడపీడల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. బెండ తర్వాత ప్రత్తి వేయకూడదు.జొన్న సాగు చేసిన వెంటనే మిరప వేయకూడదు. ఈ పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశించి నష్ట పరుస్తాయి.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు

రైతులు ముఖ్యంగా పండ్లతోటలు సాగ చేసే రైతులు భూసార పరీక్షలు చేయించి పంటలు సాగు చేసుకోవాలి. లేకపోతే ఐదేళ్ల వరకు పెంచి కాపు కొచ్చే దశలోనే క్షీణించి రైతుకు పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంది. భూసార పరీక్షలు ద్వారా తమ నేల ఏ పంటలకు అనుకూలమో నిర్ధారించుకోవాలి.

లోతు దుక్కులతో కలుపు నిర్మూలన

తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పొలాల్లో పెరిగి పంటలు నాశనం చేస్తాయి. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. దీనివల్ల భూసారం తగ్గడమే కాకుండా భూమిలోని లోతైన పొరల్లో తేమ తగ్గుతుంది. తుంగ, గరికల వేర్లు దుబ్బుగా ఉండి నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు వేర్లు , దుంపలు ఏరి వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దున్ని తొలకరి వర్షాలకు గొర్రు, గుంటులతో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారుతుంది. పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేలకోతకు గురికాకుండా వాలుకు అడ్డంగా దున్నడం, వర్షపు నీటికి ప్రవాహానికి అడ్డంగా చిన్నపాటి మట్టి, రాతి కట్టడాలు ఏర్పాటు చేసుకోవాలి. పత్తి, కంది, ఆముదం కట్టెలను తొలగించి పొలంలోనే కాల్చివేయాలి. పొలంలో గట్టిపొర ఏర్పడితే ఎర్రని ఇసుక మట్టిని తోలడం వల్ల భూమి బాగుపడుతుంది. వేసిన పంట నుంచి వేర్లు సులభంగా భూమిలోకి దిగుతాయి. వేసవిలోనే సేంద్రియ ఎరువులు పంట పొలాలకు తరలించుకోవాలి. నీటి లభ్యత ఉన్న రైతులు పెంట కుప్పలపై నీటిని అడపదడపా చిలుకరించడం వల్ల తొందరగా ఎరువుగా మారుతుంది. కుళ్లని సేంద్రియ ఎరువులు వర్షాధార పంటల్లో త్వరగా బెట్ట పరిస్థితులను కల్గిస్తాయి.